ప్రజాశక్తి
మంగళవారం 7 ఫిబ్రవరి 2023



శ్రీశైలం మల్లన్నకు పొందూరు వస్త్రాలు



ఊరేగిస్తున్న శ్రీశైలం మల్లన్న తలపాగా

పొందూరు: ఈనెల 18న మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం మల్లికార్జున స్వామి కోసం తలపాగా, వస్త్రాలను స్థానిక లావేటివీధికి చెందిన చేనేత కార్మికుడు బనిశెట్టి వీరాంజనేయులు నేశారు. కుటుంబ సభ్యులతో కలిసి నెల రోజుల పాటు శ్రమించి వస్త్రాలను అపురూపంగా తీర్చిదిద్దారు. మల్లికార్జున స్వామికి 160 మీటర్ల పొడవు, 48 సెంటీమీటర్ల వెడల్పు గల తలపాగాను నేశారు. భ్రమరాంబకు 6 మీటర్ల పసుపు అంచు చీర, శనగల బసవన్నకు 6 మీటర్ల ఎరుపు అంచు పంచె, సాక్షి గణపతికి మూడు మీటర్ల అంచు నేశారు. ఈ వస్త్రాలను సోమవారం ఊరేగించారు. గతంలో వాండ్రంగి వీధికి చెందిన ఆకాశం ముఖలింగం 33 సార్లు శ్రీశైలం వెళ్లి వస్త్రాలను సమర్పించారు.

కదంతొక్కిన అంగన్వాడీలు



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన అంగన్వాడీలు

- ఆర్అండ్‌బి కార్యాలయం నుంచి ప్రదర్శన
- కలెక్టరేట్ వద్ద బైఠాయింపు
- కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలి
- సిఐటియు, అంగన్వాడీ యూనియన్ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన అంగన్వాడీలు కదంతొక్కారు. యూనియన్ పిలుపుమేరకు సోమవారం చేపట్టిన చలో కలెక్టరేట్‌కు జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. నగరంలోని ఆర్అండ్‌బి కార్యాలయం నుంచి ప్రదర్శనగా కలెక్టరేట్ వరకు వెళ్లి అక్కడ బైఠాయించారు. కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు.

అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.సుధ, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. చలో కలెక్టరేట్‌లో అంగన్వాడీలను ఉద్దేశించి వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో ఇంటర్‌నెట్ సౌకర్యం అందుబాటులో ఉండడం లేదని, తమ సొంత ఫోన్‌లో ఎఫ్ఆర్ఎల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నా సిగ్నల్ లేక ఆ యాప్ పనిచేయడం లేదని చెప్పారు. అందువల్ల అంగన్వాడీలకు ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు లేవని, కొన్ని కేంద్రాలకు విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని విమర్శించారు. టిఎ, డిఎలు ఐదేళ్లుగా ప్రభుత్వం చెల్లించడం లేదని చెప్పారు. రకరకాల యాప్‌లను తీసుకొచ్చి అంగన్వాడీలకు పనిభారం పెంచినా, వేతనాలు పెంచలేదని విమర్శించారు. అంగన్వాడీలకు ఇచ్చిన ఫోన్లు పనిచేయడం లేదని, మరోవైపు ఫేస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంపూర్ణ పోషణ పథకం మెనూకు తగిన విధంగా ఛార్జీలు ఇవ్వడం లేదని, సరుకుల పరిమాణం పెంచలేదన్నారు. గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని చెప్పారు. అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. వారికి ఉద్యోగ భద్రత లేదన్నారు. అంగన్వాడీ కేంద్రాలను సచివాలయాల పర్యవేక్షణలో చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇప్పటికే ఐసిడిఎస్ అధికారులు పర్యవేక్షిస్తున్నారని గుర్తుచేశారు. ఫుడ్ కమిషనర్, ఎంఎస్‌కె, తహశీల్దార్, ఎంపిడిఒ, రాజకీయ నాయకులు ఇలా అనేక మంది విజిట్ల పేరుతో అంగన్వాడీలను అవమానిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసారు. అంగన్వాడీలు మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అంగన్వాడీలపై పనిభారం తగ్గించాలని, వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి నిధులు పెంచి, అంగన్వాడీలకు ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.ఐదు లక్షలు, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సూపర్‌వైజర్ పోస్టుల్లో వయోపరిమితి తొలగించాలని, ప్రమోషన్లో రాజకీయ జోక్యం అరికట్టాలన్నారు.

300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి. వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలి. మినీ సెంటర్‌లోని వర్కర్లను మెయిన్ వర్కర్లుగా తీసుకోవాలని, అదనంగా హెల్పర్‌ను ఇవ్వాలని కోరారు. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలని, ఆయిల్, కందిపప్పు పరిమాణాన్ని పెంచాలన్నారు. ప్రభుత్వమే గ్యాస్‌ను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీలు, సభలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నంబరు 1ను రద్దు చేయాలన్నారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో యూనియన్ నాయకులు కె.కళ్యాణి, శాంతామణి, ఎన్.హైమావతి, హేమ, ఎం.మంజుల, ఎం.జయలక్ష్మి, కె.సుజాత, ఎ.హేమలత, పి.భూలక్ష్మి, జె.కాంచన, అల్లు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు రేషన్ డీలర్ల సమ్మె

నిలిచిపోనున్న సరుకుల పంపిణీ



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రేషన్ పంపిణీలో ఎదుర్కొంటున్న పలు సమస్యలపై జిల్లావ్యాప్తంగా మంగళవారం డీలర్లు సమ్మె చేపట్టనున్నారు. డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డి.సోమేశ్వరరావు పేరుతో సోమవారం ఒక సందేశాన్ని డీలర్లకు పంపారు. ఈనెల 7న రేషన్ నిలుపుదల చేయాలని, ఎండియు (మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్) ఆపరేటర్ల నుంచి ఈ-పాస్ యంత్రాలను తీసుకోవాలని, మళ్లీ 8న వారికి అప్పగించాలంటూ సూచించారు. జిల్లాలో 1603 రేషన్ దుకాణాలు ఉన్నాయి. రేషన్ డీలర్ల సమ్మెతో వీటిలో సరుకుల పంపిణీ నిలిచిపోనుంది.

ప్రధాన డిమాండ్లు ఇవే...

వేర్‌హౌస్ నుంచి లారీల్లో వచ్చిన సరుకులు కాటాపై వేయకుండా స్టేజ్-2 కాంట్రాక్టు వెహికల్‌పై వేసి డీలర్లకు బస్తాలు లెక్కన పంపిస్తుండడంతో తరుగు భర్తీ చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని డీలర్లు చెప్తున్నారు. ఈ-పాస్ మిషన్‌లో గోనె సంచుల బరువును మినహాయించి బియ్యం బరువుకు మాత్రమే బిల్లులు వచ్చే విధంగా చూడాలని వారు కోరుతున్నారు. ఎండియు ఆపరేటర్లు సరుకులు తీసుకువెళ్తున్న సందర్భంలో ఒక బస్తా తూకం అయిన తర్వాత దాన్ని దించి కాటాలో చూపిన పిమ్మట మరలా బరువు వేసి బిల్లు తీసే విధంగా మార్చాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లాలో ఉన్న ఎంఎల్ఎస్ గొడౌన్లకు రెండు లక్షల సంచులు ఇచ్చామని, సంచికి రూ.20 చొప్పున చెల్లించాలని కోరుతున్నారు. మధ్యాహ్న భోజన పథకం, ఐసిడిఎస్‌కు అందించిన సరుకులకు సంబంధించిన కమీషన్ సొమ్మును డీలర్ల ఖాతాకు వచ్చే విధంగా చూడాలని అడుగుతున్నారు. ఇప్పటివరకు గొడౌన్ నుంచి వచ్చిన సరుకుల తరుగు వల్ల పేరుకుపోతున్న సిబి (క్లోజ్డ్ బేలన్స్)లను సున్నా చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఒక నెలలో సరుకుల పంపిణీ పూర్తయిన తర్వాత నెలకు సంబంధించిన కేటాయింపులు మరుసటి రోజునే ఆర్ఒలు వచ్చే విధంగా చూడాలని కోరుతున్నారు.

15న ఇఎంయు ప్యాసింజరు పున: ప్రారంభం

ఆమదాలవలస: ఇఎంయు ప్యాసింజర్ రైలును ఈనెల 15వ తేదీ నుంచి పున: ప్రారంభిస్తున్నట్లు రైల్వే అధికారి సురేష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో కోవిడ్ కారణంతో నిలిచిపోయిన ఈ రైలు 15వ తేదీన విశాఖపట్నం రైల్వేస్టేషన్ నుంచి ఉదయం 7.50 గంటలకు బయలుదేరి మర్రిపాలెం, సింహాచలం, పెందుర్తి, కొత్తవలస, కంటకాపల్లి, అలమండ, కోరుకొండ, విజయనగరం, నెల్లిమర్ల, గరివిడి, చీపురుపల్లి, బాతువ, జి.సిగడాం, పొందూరు, దూసి, శ్రీకాకుళం రోడ్డు, ఉర్లాం, తిలారు, హరిశ్చంద్రపురం, కోటబొమ్మాళి, దండుగోపాలపురం, నౌపడ, రౌతుపురం, పూండి స్టేషన్లలో ఆగుతూ పలాస రైల్వేస్టేషన్‌కు మధ్యాహ్నం ఒంటి గంటకు చేరుతుందని తెలిపారు. తిరిగి అదే రైలు పలాస నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.45 గంటలకు శ్రీకాకుళం రోడ్డుకు చేరుకుంటుందని పేర్కొన్నారు. సాయంత్రం 5.50 గంటలకు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఎనిమిది బోగీలతో నడిచే ప్యాసింజర్ రైలు సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాదకద్రవ్యాల నివారణకు పటిష్ట ప్రణాళిక

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల విక్రయాలపై నిఘా పెంచాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. జాతీయ బాలల హక్కుల కమిషన్, మాదకద్రవ్యాల నిరోధక శాఖలు సంయుక్తంగా రూపొందించిన జాయింట్ యాక్షన్ ప్లాన్ అమలుపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నివారణకు నెలవారీ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలో మాదకద్రవ్యాల వాడకాన్ని పూర్తిగా నిరోధించాలని, ఇందుకోసం పటిష్ట ప్రణాళికను రూపొందించాలని సూచించారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు అవగాహన కలిగించాలన్నారు. ఇందుకోసం స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. మత్తు కలిగించే పదార్థాలను విక్రయించే షాపులపై నిఘా పెట్టాలన్నారు. మద్యం షాపుల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మందుల షాపులు, ఇతర ట్రేడర్స్‌తో సమావేశాలు నిర్వహించి, చట్టంలోని అంశాలను వివరించాలని చెప్పారు. ముఖ్యంగా మైనర్లకు మద్యం, పొగాకు, గంజాయి విక్రయించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల దుష్పరిణామాలను వివరిస్తూ విద్యాసంస్థల్లో హోర్డింగులు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఐసిడిఎస్ పీడీ అనంతలక్ష్మి, ఎఎస్‌పి టి.పి విఠలేశ్వరరావు, జాయింట్ యాక్షన్ ప్లాన్ నోడల్ ఆఫీసర్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.వి రమణమూర్తి, డిఎంహెచ్ఒ మీనాక్షి, ఔషధ నియంత్రణశాఖ, జిల్లా బాలల సంరక్షణాధికారి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లు ఎవరికి ఓటెయ్యాలో చెప్పకూడదా?

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - గార

వాలంటీర్లు ఏ రాజకీయ పార్టీకి ఓటు వేయాలో చెప్పకూడదని ఎవరు అన్నారని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రశ్నించారు. మండలంలోని సతివాడలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మంచి చేస్తున్న ప్రభుత్వం గురించి, పార్టీ గురించి ప్రజలకు చెప్పడంలో తప్పు ఏముందన్నారు. వాలంటీర్లు పౌరులు కాదా? వారికి హక్కులు ఉండవా అని ప్రశ్నించారు. పొరపాటున మళ్లీ చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే మొదట తుపాకీ పేలేది వాలంటీర్లపైనేనని చెప్పారు. ఇప్పుడు మన చేతిలో తుపాకి ఉందని, మనమే ముందుగా పేల్చేస్తే ఏ ఇబ్బందీ ఉండదన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు, ఎంపిపి గొండు రఘురాం, వై.నారాయణ, కె.నాగభూషణ్, ముంజేటి కృష్ణ, పీస గోపి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

'ఆశా'లను కార్మికులుగా గుర్తించాలి

- కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి
- రాజకీయ వేధింపులు ఆపాలి
- ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలో రాష్ట్ర అధ్యక్షులు పోశమ్మ
- నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పోశమ్మ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఆశావర్కర్లను కార్మికులుగా గుర్తించాలని ఎపి ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పోశమ్మ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన యూనియన్ జిల్లా 5వ మహాసభలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం స్కీమ్‌ల పేరుతో ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులను తీవ్ర శ్రమదోపిడీ చేస్తోందని విమర్శించారు. ఆశావర్కర్లకు శ్రమకు తగ్గ ఫలితం రావడం లేదని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో ఎన్‌హెచ్ఎం (జాతీయ ఆరోగ్య మిషన్)కు కోత విధించడం అన్యాయమన్నారు. వేతనాలు అరకొరగా చెల్లిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిపై అధిక పనిభారం మోపుతున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో ఆశాలు తీవ్ర పని ఒత్తిడి లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశాలను సచివాలయాలకు అనుసంధానం చేసి అందించాల్సిన సేవల పరిమితిని పెంచడంతో తీవ్ర వ్యయ ప్రయాసలకు లోనవుతున్నారని చెప్పారు. ఆశాలకు నిర్ధిష్ట పని గంటలంటూ ఏమీ లేవని, రాత్రీ పగలనక పనిచేస్తున్నారని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆశాలకు బయోమెట్రిక్ హాజరు అమలు చేస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 60 ఏళ్లు నిండిన ఆశాలను రాష్ట్ర ప్రభుత్వం రిటైర్మెంట్ పేరుతో ఇంటికి పంపేస్తోందన్నారు. ఆశాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా కూడా చెల్లించడం లేదని విమర్శించారు. ఆశా వర్కర్లను ఉద్యోగులుగా పరిగణించి వారిని అన్నిరకాల సంక్షేమ పథకాలకు అనర్హులను చేయడం సరికాదన్నారు. ఆశాలపై ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం పనిభారం పెంచుతుంటే, మరోవైపు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు వేధింపులకు పాల్పడుతున్నారని చెప్పారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ విధానాలను ప్రతిఘటించకపోతే దేశ సంపదంతా అదానీ, అంబానీలపరం అవుతుందని చెప్పారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కార్మికులను ఆధునిక నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి వారిని బానిసలుగా మార్చాలని చూస్తోందని విమర్శించారు. జిఎస్‌టి భారాలు సామాన్యుల పైనే ఎక్కువ పడుతుందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరిచారని విమర్శించారు. కార్పొరేట్లకు రాయితీలు, సామాన్యులపై భారాలు అనే విధంగా కేంద్ర బిజెపి పాలన ఉందని విమర్శించారు. మోడీ కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు సంఘటితం కావాలన్నారు. అంతకుముందు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగమణి జెండాను ఆవిష్కరించారు.

శ్రమదోపిడీపై పోరు సాగించాలి

ఆశాలకు కనీస వేతనం చెల్లించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగిస్తున్న శ్రమ దోపిడీపై పోరాటం సాగించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఎన్.వి రమణ అన్నారు. మహాసభకు హాజరై సౌహార్థ సందేశం ఇచ్చారు. సభ్యత్వ పెంపు కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శి రాజు, హరీష్ మాట్లాడారు. ఈ సందర్భంగా మూడేళ్ల కాలంలో జిల్లాలో సాగించిన పోరాటాలు, సాధించిన విజయాలపై యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణి నివేదిక ప్రవేశపెట్టారు. ప్రజా కళాకారులు హేమసూదన్, బాలాజీ విప్లవ గీతాలను ఆలపించి ఉత్తేజపరిచారు.



జి.అమరావతి



పి.ధనలక్ష్మి

నూతన కమిటీ ఎన్నిక

మహాసభ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కె.నాగమణి, అధ్యక్షులుగా డి.ధనలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా జి.అమరావతి, కోశాధికారిగా పి.ధనలక్ష్మి, ఉపాధ్యక్షులుగా పి.కాంతమ్మ, జి.పార్వతి, సిహెచ్.లక్ష్మి, సహాయ కార్యదర్శులుగా స్వర్ణలతా పట్నాయక్, లావణ్య, ప్రేమలతతో పాటు 11 మందిని ఆఫీసు బేరర్లుగా, 22 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలి

'స్పందన'కు 193 వినతులు



జెసికి సమస్యను వివరిస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లావ్యాప్తంగా ధాన్యం నిల్వలను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి పి.ప్రసాదరావు, భవిరి కృష్ణమూర్తి, పొందూరు చంద్రరావు అన్నారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్ వినతులను స్వీకరించారు.

లక్ష్యాలు పూర్తయ్యాయని చెప్తూ రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయడం లేదని నాయకులు ఫిర్యాదు చేశారు. పెసర, మినుము పంటలు ఉన్నందున చాలామంది నూర్పులు పూర్తి కాలేదన్నారు. ఒడిశా ధాన్యంతో లక్ష్యాలు పూర్తి చేశారని తెలిపారు. బ్యాంకు గ్యారంటీ పూర్తయిందని మిల్లర్లు ధాన్యం తీసుకోకపోవడంతో పొలంలో ఉన్న ధాన్యాన్ని అడవి పందులు తినేస్తున్నాయని, కొన్నిచోట్ల అగ్ని ప్రమాదాలు సంభవించి రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఈనెల 15వ తేదీ వరకు గడువు పెట్టకుండా ధాన్యం కొనుగోలు సమయం పెంచాలని, ఏ మండలంలోని ధాన్యాన్ని ఆ మండలంలోని మిల్లుకి పంపాలని కోరారు. జెసి నవీన్ స్పందిస్తూ సమస్య ఉన్న చోట లక్ష్యాన్ని పెంచుతామని హామీనిచ్చారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఉపాధి కూలీల కుటుంబాలకు రూ.25లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం ఇవ్వాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం డిమాండ్ చేశారు. ఆమదాలవలస రూరల్ మండలం మండాదిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అంబటి సత్తెమ్మ, అమలాపురం గౌరమ్మ, మురువందల పాపమ్మ, కురమా లక్ష్మి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని అన్నారు. వీరి కుటుంబాలకు మానవతా దృక్పథంతో రూ.7.5 లక్షల మేర పరిహారం చెల్లించేందుకు వీలుందని డ్వామా పీడీ కలెక్టర్‌కు వివరించారు.

జిల్లాలో ఎస్‌టి ధ్రువీకరణ పత్రాల మంజూరుపై కమిషన్ నడుస్తుండగా కవిటి తహశీల్దార్ ఎస్‌టి ధ్రువపత్రం మంజూరు చేయడాన్ని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి ఆక్షేపించారు. కలెక్టర్‌కు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో సవర కుమార్, చుక్కరావు, జి.రమణమూర్తి, తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంటకరావు, పాతపట్నం నియోజకవర్గంలోని రైతులు కోరారు. హిరమండలం మండలం ఎం.అవలంగి గ్రామానికి చెందిన బురగపు రాజేశ్వరి ఇల్లు కాలిపోవడంతో 10.40 సెంట్ల భూమి పట్టా కాలిపోయిందని, నకలు ఇప్పించాలని కోరారు. సుభలై గ్రామానికి చెందిన ఎ.అప్పన్న తన తండ్రి పేరున 13.5 సెంట్ల భూమి ఉందని, పాస్ పుస్తకం ఉందని, కొందరు స్థలం ఆక్రమించారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా 193 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్, జెడ్‌పి సిఇఒ వెంకటరామన్, నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జివి.చిట్టిరాజు, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, డిఎస్ఒ వెంకటరమణ, వ్యవసాయశాఖ జెడి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేపై ప్రత్యేక దృష్టి

- రబీ ఇ-క్రాప్ బుకింగ్ వేగవంతం
- జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్



సమావేశంలో మాట్లాడుతున్న జెసి నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో రీ సర్వే మరింత వేగవంతం కావాలని, దీనిపై తహశీల్దార్లు, ఉప తహశీల్దార్లు ప్రత్యేక దృష్టిసారించాలని జాయింట్ కలెక్టర్ దృష్టిసారించాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మండల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆర్‌డిఒలు, మండల ప్రత్యేక అధికారులతో రీ సర్వే, స్టోన్ ప్లాంటేషన్, ధాన్యం సేకరణ, ఇ-క్రాప్ బుకింగ్, ఇకెవైసి, నాలా, శ్మశానవాటిక స్థలం గుర్తింపు, ఫేసియల్ రికగ్నేషన్ అటెండెన్స్, స్పందన ఫొటో అప్‌లోడ్ తదితర అంశాలపై సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరుకు 223 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 54 గ్రామాల్లో మాత్రమే రీ సర్వే పూర్తయిందన్నారు. వచ్చే నెలకు ఆర్ఒఆర్ పూర్తి కావాలంటే ఈ నెలాఖరుకు డిఎల్ఆర్ పూర్తి కావాల్సి ఉందని తెలిపారు. వాటిపై తహశీల్దార్లు, ఉప తహశీల్దార్లు ప్రత్యేక దృష్టిసారించి లక్ష్యాలను అధిగమించాలని చెప్పారు. జిల్లాలో స్టోన్ ప్లాంటేషన్ మరింత వేగవంతం కావాలన్నారు. ఇప్పటివరకు స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేసిన వాటికి శతశాతం చెల్లించినట్లు తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లోనూ స్టోన్ ప్లాంటేషన్ చేపట్టి పూర్తి చేస్తే వాటికీ చెల్లింపులు చేస్తామన్నారు. గ్రౌండ్ కంట్రోల్ పాయింట్, చెక్ పాయింట్ వేగవంతం చేయాలన్నారు. నేటికీ పేదలందరికీ పట్టాలు అనే అంశంపై ఆరా తీశారు. జిల్లాలో 2,365 పట్టాలు నేటికీ ప్రింటింగ్ కాలేదని, పట్టాలు జనరేట్ చేసి పంపించాలని ఆదేశించారు. పంపిన వెంటనే ప్రింటింగ్‌కు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. జిల్లాలో 93 శాతం ధాన్యం కొనుగోలు చేశామని, మిగిలిన కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇప్పటివరకు జరిగిన రబీ ఈ-క్రాప్ బుకింగ్‌లో జిల్లా వెనుకంజలో ఉందని, దాన్ని మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. 25 శాతం వరకు ఇకెవైసి కాలేదని, రోజుకు 500 మంది రైతులకు ఇకెవైసి జరిగేలా చర్యలు చేపట్టాలని తహశీల్దార్లకు సూచించారు. ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ వేగవంతం చేయాలన్నారు. స్పందనలో వచ్చే ఫిర్యాదులపై లబ్ధిదారుల ఫొటోలను అప్‌లోడ్ చేయాలని, కచ్చితమైన గడువుతో సమాచారాన్ని అందజేయాలని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, జిల్లా వ్యవసాయ అధికారి కె.శ్రీధర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి ఆర్.వి వరప్రసాదరావు, ఇతర జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటా

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని మండాది గ్రామం వద్ద శనివారం లారీ ఢీకొని మృతి చెందిన కుటుంబ సభ్యులకు ప్రభుత్వపరంగా అండగా ఉంటామని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదం జరిగిన నుంచి ఆస్పత్రి వరకు, అంత్యక్రియల్లో తన అనుచరులు సహాయ సహకారాలు అందించారని తెలిపారు. స్థానిక నాయకులతో ఎప్పటికప్పుడు ఫోన్లో మాట్లాడుతూనే ఉన్నానని పేర్కొన్నారు. అలాగే పోలీసులతో, అధికారులతో మాట్లాడి అప్రమత్తం చేసినట్లు తెలిపారు. బాధ్యత గల ప్రజా ప్రతినిధిగా తన కర్తవ్యాన్ని నిర్వర్తించినట్లు గుర్తుచేశారు. వ్యక్తిగత కారణాలతో పరామర్శించలేదని, ఇటువంటి సున్నితమైన విషయాలను రాజకీయ కోణంలో చూడటం తగదని అన్నారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన ఎక్స్‌గ్రేషియా బాధిత కుటుంబాలకు అందేలా చొరవ చూపుతానని స్పష్టం చేశారు.



మంత్రిని సన్మానిస్తున్న ఎన్‌జిఒ నాయకులు

ఉద్యోగుల శ్రేయస్సుకు సహకారం

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగుల శ్రేయస్సుకు తన వంతు పూర్తి సహకారాన్ని అందిస్తానని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో ఎన్‌జిఒ నాయకులు మంత్రిని మర్యాద పూర్వకంగా సోమవారం కలిశారు. ఈ మేరకు ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గానికి 8వ సారి ఏకగ్రీవంగా ఎన్నికైన చౌదరి పురుషోత్తం నాయుడును సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉద్యోగులతో తానెప్పుడూ స్నేహితునిగానే కొనసాగడానికి ప్రాధాన్యత నిస్తానన్నారు. పదవులు శాశ్వతం కాదని, ఉద్యోగులు బయటి వారు కాదని, అందువల్లే వారి శ్రేయస్సుకు తన వంతు సహకారాన్ని అందిస్తానని హామీనిచ్చారు. అనంతరం ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో రాయి వేణుగోపాల్, కంఠ జయరావు, బడగల పూర్ణచంద్రరావు, కాయల శ్రీనివాసరావు, ఆర్.గోవిందపట్నాయక్, శ్రీరాంకుమార్, కె.రోజాకుమారి, బొత్స శ్రీనివాసరావు, బారకల నవీన్, ఇప్పిలి చిట్టిబాబు, వై.అప్పలరాజు, షబీనాబేగం, తారక్ పాల్గొన్నారు.



పలాస : పర్యటిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

అర్హులకు సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి- పలాస

వైసిపి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని రాష్ట్ర పశుసంవర్థకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని గరుడఖండి పంచాయతీలో సోమవారం గడప గడపకు వైసిపి ప్రభుత్వం నిర్వహించారు. తొలుత మంత్రికి గ్రామస్తులు, వైసిపి నాయకులు గజమాలతో సత్కరించారు. అనంతరం గ్రామంలో పర్యటించి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొత్స రాజేశ్వరి, ఎంపిపి ఉంగ ప్రవీణ, పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు, ఉంగ సాయికష్ణ, బొత్స షణ్ముఖరావు, సర్పంచుల సంఘం అధ్యక్షులు కొర్ల సంతోష్‌కుమార్, దువ్వాడ రవికుమార్, ఎంపిటిసి గొండు మోహన్‌రావు, ఎంపిడిఒ రమేష్, తహశీల్దార్ మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి వైపు అడుగులు

వజ్రపుకొత్తూరు: వైసిపి బలోపేతానికి పార్టీలో చేరుతూ అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారని రాష్ట్ర మత్స్య, పశు సంవర్థకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. గరుడభద్ర పంచాయతీ పరిధిలోని టిడిపి కుటుంబాలు ఏరుపల్లి అప్పారావు, కూర్మారావు, రామచంద్రరావు, అర్లి కేశవరావు, టి.నవీన్ సర్పంచ్ ప్రతినిధి గూడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి కోసం దేశం యావత్తు ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా జగన్ జనరంజక పాలన సాగిస్తున్నారని అన్నారు. కార్యకర్తల ఆదరణ కొండంత అండతో నియోజకవర్గం క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని కార్యకర్తల సమక్షంలో ప్రకటించారు. కార్యక్రమంలో అర్లి దానేసు, గూడ భాస్కరరావు, తులే గణేష్, వై. సురేష్ తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

'మ్యాజికల్ ఒడిస్సే' బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అపర ఆంధ్రా సర్కారు, మాంత్రిక రాజా నిర్వహించనున్న కార్యక్రమం విజయవంతం కావాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆకాంక్షించారు. మాంత్రిక రాజా ఆధ్వర్యాన జాతీయ సమైక్యత, విద్య, సామాజిక చైతన్యం, సాంస్కృతిక వికాసం కోసం నిర్వహించనున్న 'మ్యాజికల్ ఒడిస్సే ఫర్ నేషనల్ ఇంటిగ్రేషన్' బ్రోచర్‌ను జెడ్‌పిలో సోమవారం ఆవిష్కరించారు. డిఇఒ జి.పగడాలమ్మ మాట్లాడుతూ శ్రీనివాసరాజు ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వేలాది ప్రదర్శనలిచ్చారని, మూఢనమ్మకాలను నిర్మూలించేందుకు సామాజిక చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేశారని అన్నారు. జాతీయ సమైక్యత కోసం మరో కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం.మాధురీలత మాట్లాడుతూ సిక్కోలు ఖ్యాతిని జాతీయ, అంతర్జాతీయస్థాయిలో చాటాలన్నారు. కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌పి స్పందనకు 28 వినతులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

శ్రీకాకుళం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి 28 వినతులు అందాయని ఎస్‌పి జి.ఆర్.రాధిక తెలిపారు. అదనపు ఎస్‌పి విఠలేశ్వరరావు ఫిర్యాదులను స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార చర్యలపై అధికారులకు ఆదేశాలు చేశారని అన్నారు. ఈ మేరకు ఫిర్యాదిదారులు తమ అభ్యర్థనలను రాతపూర్వకంగా విన్నవించుకున్నారు. అనంతరం ఎస్‌పి ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. స్పందనలో వచ్చే ఫిర్యాదులపై తక్షణ చర్యలు చేపట్టి పరిష్కార మార్గాలు చూపాలని అధికారులతో తక్షణమే ఫోన్ కాల్ ద్వారా సూచనలు చేశారు. ఫిర్యాదుదారుల వివరాలు, వారి సమస్యలను తెలియపరచి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదిదారులకు చట్ట పరిధిలో సత్వర న్యాయం అందించాలని ఆదేశించారు. ఈ ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు జిల్లా కార్యాలయానికి ఎప్పటికప్పుడు నివేదిక అందించాలని సూచించారు. అదృశ్యంపై ఒకటి, మోసపూరితమైనవి రెండు, కుటుంబ తగదాలకు సంబంధించినవి ఆరు, తగాదాలపై నాలుగు, పాత అర్జీలు ఐదు, ఇతర ఫిర్యాదులు పది వచ్చాయని తెలిపారు.



సమీక్షిస్తున్న ఎంపిడిఒ వెంకటరమణ

అభివృద్ధి పనులపై సమీక్ష

సోంపేట : మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల సుస్థిర అభివృద్ధిపై మండలస్థాయి అధికారులతో ఎంపిడిఒ బి.వెంకటరమణ సోమవారం సమీక్షించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు, వాటి వినియోగంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు అభివృద్ధి పనులపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎపిఒ ప్రమీల, ఎపిఎం రమణమ్మ, వైద్యాధికారులు హరికిరణ్, సౌజన్య, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రైల్వే అధికారులకు జనసేన వినతి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీలో ఆంధ్రా-ఒడిశా సరిహద్దు కొలిగం రోడ్డులోని రైల్వే గేటు వల్ల నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని జనసేన ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు అన్నారు. అండర్ పాస్‌వే లేకపోవడం వల్ల నిత్యం ప్రజలు పడుతున్న ఇబ్బందులపై సంతకాలతో సేకరించిన వినతిపత్రాన్ని ఖుర్దా రైల్వే ఉన్నతాధికారులకు సోమవారం అందించారు. జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధనరెడ్డి, బైపల్లి ఈశ్వరరావు, నాగుల హరిబెహరా ఈస్టుకోస్టు రైల్వే భువనేశ్వర్ జిఎంను కలిసిన వెంటనే సంబంధిత శాఖ అధికారులతో ఫోన్‌లో సంప్రదించారని తెలిపారు. అక్కడ అండర్‌పాస్ వే వేయడానికి ఎటువంటి అనుమతి లేదని ఇంజినీరింగ్ అధికారులు చెబితే వెంటనే వేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో రోకళ్ల భాస్కరరావు, నిమ్మన రమణారావు, తదితరులు పాల్గొన్నారు.



ఖుర్దా రైల్వే అధికారికి వినతిపత్రం అందిస్తున్న జనసేన నాయకులు



అవార్డు అందుకుంటున్న జయశ్రీ, సభ్యులు

కాష్యూ ల్యాండ్ వనిత సభ్యులకు అవార్డు

పలాస: శ్రీకాకుళంలోని ఓ హోటల్‌లో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జరిగిన ప్రాంతీయ సదస్సులో పలాస లయన్స్ క్లబ్ క్యాషు ల్యాండ్ వనిత అధ్యక్షులు మల్లా జయశ్రీ, శ్వేత కుమారి, మల్లా సంతోషి, బల్ల ఉషా, తూముల గాయత్రిలకు శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ ఓబులేసు అవార్డును అందజేశారు. లయన్స్ క్లబ్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు ఈ అవార్డు లభించిందని మల్లా జయశ్రీ తెలిపారు. క్యాషు ల్యాండ్ వనిత సభ్యులకు అవార్డు రావడంపై క్లబ్ ప్రాంతీయ చైర్మన్ నటుకుల మోహన్‌రావు , రెడ్‌క్రాస్ అధ్యక్షులు జగన్నాథం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.



స్వర్ణకుమారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గణపతి

రఘురాంకు పరామర్శ

టెక్కలి రూరల్: సిఎం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం సతీమణి స్వర్ణకుమారి ఇటీవల మృతిచెందారు. ఈ సందర్భంగా గొల్లపూడిలో రఘురాంను టెక్కలి వైసిపి నియోజకవర్గ నాయకులు చింతాడ మంజు గణపతి, సినీ నిర్మాత బలగ ప్రకాష్ కలిసి, సంతాపం తెలిపారు. ఆమె చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు.



ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

సౌమ్యరాణికి కలెక్టర్ అభినందనలు

శ్రీకాకుళం అర్బన్ : సౌమ్యరాణి మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు తద్వారా రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తేవాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సూచించారు. 2వ ఖేలో ఇండియా జాతీయ మహిళల సౌత్ జోన్ లీగ్/ర్యాంకింగ్ జూడో టోర్నమెంట్ పోటీల్లో నగరానికి చెందిన సౌమ్యరాణి బంగారు పతకాన్ని సాధించారు. ఈ మేరకు జెడ్‌పిలో సోమవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆమెకు ప్రశంసాపత్రం అందజేసి అభినందనలు తెలిపారు. ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు బెంగుళూరులో నిర్వహించిన జాతీయ పోటీల్లో ఆమెకు స్వర్ణం దక్కింది. నగరంలోని గుజరాతీపేటలో ఉన్న వరం నగరపాలక హైస్కూల్లో పదో తరగతి చదువుతుంది. డిఎస్‌ఎ జూడో కోచ్ పి.ఎస్.మణికుమార్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్న ఆమె గతంలో రాష్ట్ర స్థాయిలో అనేక పతకాలు సాధించింది. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, జిల్లా విద్యాశాఖాధికారి పగడాలమ్మ, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి మాధురీలత తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న నాయకులు

ఆదానీ గ్రూప్‌పై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశ ఆర్థిక వ్యవస్థకు చేటు తెచ్చే ప్రధాని మోడీ, అమితా షా దత్తపుత్రుడు అదానీ గ్రూప్ అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బొడ్డేపలి సత్యవతి డిమాండ్ చేశారు. నగరంలోని ఎల్ఐసి కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్రం రాకముందు పేద ప్రజల సొమ్ము దాచుకోవడం కోసం చాలా ఇబ్బంది పడేవారని అన్నారు. స్వాతంత్ర అనంతరం పేద, మధ్యతరగతి కుటుంబాలకు భరోసా కనిపిస్తు కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యాన బ్యాంకులు జాతీయకరణ, ఎల్ఐసి వంటి సంస్థలను ఏర్పాటు చేసి భరోసా కల్పించిందని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను, వాటి ఆస్తులను ఆర్థికంగా దివాలా తీసే విధంగా బడా వ్యాపారవేత్తలకు వత్తాసు పలుకుతూ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇటీవల ఆదానీ గ్రూప్స్‌కు ఎల్ఐసి, ప్రభుత్వ రంగ బ్యాంకుల వద్ద రుణాల తీసుకుని తన వ్యాపారాల్లో వాడుకొని ఆర్థిక నేరాలకు పాల్పడుతూ వ్యాపార అవకతవకలకు పాల్పడిందన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజలకు నష్టదాయకంగా మారిన బిజెపి ప్రభుత్వ నిర్ణయాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సనపల అన్నాజీరావు, దేశేళ్ల గోవిందమల్లిబాబు, అంబటి కృష్ణారావు, పైడి నాగభూషణరావు, రెల్ల సురేష్, కొత్తకోట సింహాద్రినాయుడు, లఖినేని నారాయణరావు, కొత్తకోట లక్ష్మి, అంబటి దాలినాయుడు, దంత త్రినాథరావు పాల్గొన్నారు.

ప్రతి గింజా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రతి గింజా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు తమ్మినేని భాస్కరరావు, సిపిఎం మండల కన్వీనర్ నెయ్యల మోహన్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి సోమవారం ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ నగరంపల్లి పంచాయతీలో పండిన చి'వరి' గింజ వరకూ ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో ఈ-క్రాప్ ప్రకారం ఎకరాకు 30 బస్తాలు పండుతాయని, ఇప్పటివరకు 60 శాతం ధాన్యం సేకరించారని, మిగతా 40 శాతం సేకరించాలని అన్నారు. అనంతరం తహశీల్దార్ బి.అప్పలస్వామికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డి.భాస్కరరావు, భానుమతి, బి.చెల్లయ్య, బి.ఆనందరావు, నెయ్యల చంద్రయ్య, సింహాచలం, డి.భాస్కరరావు, డి.మోహన్‌రావు, ఎస్.సరోజనమ్మ, బి.లక్ష్మి, టి.లక్ష్మి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

'యువగళం'తో వైసిపి నాయకుల్లో అలజడి

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాదయాత్రతో వైసిపి నాయకుల్లో అలజడి మొదలైందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. పలాస టిడిపి కార్యాలయంలో నారా లోకేష్ 100 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి చేసిన సందర్భంగా సోమవారం విలేకరులతో ఆమె మాట్లాడారు. లోకేష్ పాదయాత్ర వల్ల రోజు రోజుకూ పెరుగుతున్న ప్రజాధరణ చూసి తాడేపల్లి ప్యాలెస్‌లో ఉన్న జగన్‌కి ఓటమి భయంతో చెమటలు పడుతున్నాయన్నారు. ఆ భయంతోనే జగన్ కొందరు అధికారులు, పోలీసులతో పాదయాత్రకు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. పాదయాత్ర బంగారు పాళ్యం చేరుకోగానే విద్యుత్ నిలిపివేశారని, అన్ని అనుమతులు ఉన్నా మూడు వాహనాలను సీజ్ చేసి బహిరంగ సభ జరగకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. తిరిగి లోకేష్ సహా టిడిపి నాయకులపై కేసులు పెట్టడం దారుణమని అన్నారు. జగన్ పాదయాత్రను అధికారంలో ఉన్న టిడిపి అడ్డుకోలేదని, ఇప్పుడు అధికారంలో ఉన్న జగన్ లోకేష్ పాదయాత్రను అడ్డుకోవడం ఇటువంటి నీచ రాజకీయాలు ఎక్కడా చూడలేదనిమండి పడ్డారు. జగన్ ఎన్ని అడ్డంకులు సృష్టించినా సరే లోకేశ్ పాదయాత్రను విజయవంతం కావడం ఖాయమన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, నాగరాజు, ఎస్.నవీన్, కొవ్వూరు సురేష్, జోగమల్లి, శంకర్, ఆత్మారావు, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గౌతు శిరీష



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కంటి ఆరోగ్యంపై శ్రద్ధ

టెక్కలి: విద్యార్థులు తమ కంటి చూపుపై శ్రద్ధ చూపాలని చాకిపల్లి కొత్తూరు సర్పంచ్ వాన తవిటయ్య కోరారు. సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వైఎస్ఆర్ కంటి వెలుగు పథకంలో భాగంగా విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 220 మందిలో 43 మందికి లోపాలు ఉన్నట్లు గుర్తించారు. 28 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేత్ర వైద్యులు ఎన్.రంగారావు, పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, ఎంపిటిసి పొందర శ్రీనివాసరావు, సిబ్బంది అన్నపూర్ణ, పార్వతీ, ఉపాధ్యాయులు పొట్నూరు జగదీష్, కురమాన దాలయ్య, కాపల నారాయణరావు, కె.చిన్నారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని గూడెం గ్రామానికి చెందిన కొర్లాన చినబాబు, సుమిత్ర దంపతులు అగ్నిప్రమాదంలో గాయపడ్డారు. సుమిత్ర ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు ఆమెకు అంటుకున్నాయి. వాటిని ఆర్పే ప్రయత్నంలో చినబాబుకు కూడా మంటలు వ్యాపించాయి. గాయపడిన వారిని స్థానికులు 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ ఎల్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురిపై కేసు నమోదు

వజ్రపుకొత్తూరు : అక్కుపల్లి కూడలిలో శనివారం రాత్రి జరిగిన సంఘటనపై అదే గ్రామానికి చెందిన నలుగురు యువకులపై కొట్లాట కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. తర్లాగడూరుకు చెందిన అంబటి సుదర్శన్ తనపై దాడి చేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు అక్కుపల్లికి చెందిన గుంటు ప్రభు, అర్జీల నవీన్, అర్జీల సోను, చొక్కర నవీన్‌లపై కేసు నమోదు చేశామని తెలిపారు.

అవగాహనతో లెప్రసీ నయం



మాట్లాడుతున్న ఎస్ఐ రాము

ప్రజాశక్తి- కవిటి

అవగాహనతో లెప్రసీని నయం చేయవచ్చని కవిటి ఎస్ఐ కె.రాము అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం లెప్రసీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్ఐ మాట్లాడుతూ లెప్రసీ అంటు వ్యాధి కాదని, వ్యాధి ఉన్న వ్యక్తులు వారి కుటుంబాలతో కలిసి జీవించడమే కాకుండా పాఠశాల, కళాశాల పనికి కూడా వెళ్లవచ్చని అన్నారు. రాజపురం పిహెచ్‌సి వైద్యుడు డాక్టర్ శశిధర్ మాట్లాడుతూ మనకి శరీరంపై ఎటువంటి అనుమానం వచ్చినా వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యున్ని సంప్రదించా లని సూచించారు. నిత్యం దానిపై పర్యవేక్షణ చేస్తూ వైద్యుని సలహాలు పాటిస్తే శాశ్వతంగా లెప్రసీని దూరం చేయవచ్చని తెలిపారు. 1980లో ప్రపంచవ్యాప్తంగా 5.2 మిలియన్ కేసులు నమోదైతే 2020 నాటికి అవి 0.2 మిలి యన్ల కంటే తక్కువకు పడిపోయాయని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 16 మిలియన్ల మంది ప్రజలు కుష్టు వ్యాధి నుండి నయమయ్యారని తెలిపారు. రాజపురం పిహెచ్‌సి ఎఒ అభిమన్యు సోయి, సిబ్బంది, జూనియర్ కళాశాల సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి



సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రైతులు

టెక్కలి: ధాన్యం కొనుగోలు చేయాలని టెక్కలి 4వ సచివాలయ రైతులు సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా ఆయనకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ తమ సచివాలయం పరిధిలో 750 మెట్రిక్ టన్నుల దాన్యాన్ని సిబ్బంది కొనుగోలు చేశారని, కానీ తమ వద్ద ఇంకా 450 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉందని, కొనుగోళ్లు నిలిపివోవడంతో సిబ్బంది ధాన్యం తీసుకోవడం లేదని వాపోయారు. కొనుగోలుకు అనుమతి ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో వైసిపి ఎంపిటిసి పీత హేమలత, దాడి ధర్మారావు, రైతులు ఇల్లా కోదండరావు, నానుబోలు శ్రీనివాసరావు, మోహనరావు, రఘునాథరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిరియా సాయిరాజ్

వైసిపి గెలుపే లక్ష్యం కావాలి

ప్రజాశక్తి- కంచిలి

రానున్న ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఇచ్ఛాపురం వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పిరాయి సాయిరాజ్ అన్నారు. ఎఎంసి ప్రాంగణంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించాలన్నారు. కార్యక్రమంలో నర్తు రామారావు, సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ డి.లోకేశ్వర్‌రెడ్డి, జెడ్‌పిటిసి ఇప్పిలి లోలాక్షి, ఎంపిపి దేవదాస్‌రెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షులు గుమ్మడి రామదాసు, వైసిపి మండల అధ్యక్షులు వజ్జా మృత్యుంజయం, ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఇకెవైసి తప్పనిసరి

టెక్కలి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఫించనుదారులకు, కుటుంబ పింఛనుదారులు తప్పనిసరిగా ఇకెవైసి నమోదు చేయించుకోవాలని టెక్కలి డివిజన్ ఉప ఖజానా కార్యాలయ సహాయ అధికారి వి.రామకృష్ణ తెలిపారు. సోమవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. నమోదులో చరవాణి నెంబర్, ఆధార్ కార్డు, జనన తేదీ వంటివి తప్పకుండా నమోదు చేయాలన్నారు. టెక్కలి సబ్ ట్రజరీ పరిధిలో కొంత మంది నమోదు చేసినప్పటికీ స్వల్ప తప్పిదాల వల్ల నమోదు కాబడలేదని తెలిపారు. ఇతర వివరాలకు కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు కష్టాలు

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్ర ప్రజలకు కష్టాలు తప్పడం లేదని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. మందస మండలం భోగాపురం గ్రామంలో సోమవారం సాయంత్రం రాష్ట్రానికి ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా బుడార్సింగి పంచాయతీలో కురడాల గ్రామానికి చెందిన వైసిపి నాయకులు విజయకుమార్ పండా, గోపాలకృష్ణ పండా, చైతన్య బెహరా, నాగి బెహరా, శివరాం బెహరా తదితర కుటుంబాలు టిడిపిలో చేరాయి.

ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఇష్టానుసారంగా ధరలు పెంచుతున్నారని, వీటివల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అరాచకాలను ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బావన దుర్యోధన, బమ్మిడి కరెయ్య, ముడిమించి నవీన్, రట్టి లింగరాజు, తమ్మినేని ధనుంజయ, బేసి గణపతి, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గౌతు శిరీష

వేర్వేరు ప్రమాదాల్లో మూడు ఇళ్లు దగ్ధం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని సంతకొత్తవలసలో బూరవెల్లి అసిరయ్య, తిరుపతిరావులకు చెందిన రెండు పూరిల్లు దగ్ధమయ్యాయి. సోమవారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. ఆ సమయంలో పొలం పనుల్లో బాధితులు ఉండడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గ్రామస్తుల అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేశారు. అగ్నిమాపక అధికారి కె.అప్పారావు తన సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం సంభవించినట్లు తెలిపారు. రూ.లక్ష వరకు ఆస్తినష్టం ఉంటుందని అంచనా వేశారు.

సింగన్నపాలెంలో...

బూర్జ: మండలంలోని సింగన్నపాలెంలో ఆదివారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో కొల్లివలస లింగంనాయుడుకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ధాన్యం, నగదు, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. ఒక్కసారిగా ఇంట్లో నుంచి మంటలు రావడంతో కుటుంబ సభ్యులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బయటకు వచ్చారు. సమాచారం అందుకున్న ఆమదాలవలస అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. కాయ్ కష్టం చేసుకుని సంపాదించిన మొత్తం అగ్నికి ఆహుతి కావడంతో కట్టుబట్టలతో నడిరోడ్డున పడ్డామని లింగంనాయుడు బోరున విలపించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ సచివాలయ సిబ్బంది సంఘట నా స్థలానికి చేరుకొని ఆస్తి నష్టాన్ని అంచనా వేశారు.



ఆమదాలవలస : దగ్ధమవుతున్న పూరిళ్లు

నెమలి ఫించంపై కళాతపస్వి చిత్రం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఇటీవల కన్నుమూసిన ప్రఖ్యాత తెలుగు చలన చిత్ర దర్శకులు, నటుడు కళాతపస్వి కె.విశ్వనాథ్‌కు నివాళులు అర్పిస్తూ జాతీయ పక్షి నెమలి పించంపైన ఆయన సూక్ష్మ చిత్రాన్ని నగరానికి చెందిన రాహుల్ సోమవారం వేశారు. రెండు గంటల సమయంలో ఒక అంగుళం సైజులో చిత్రాన్ని వేశారు. ఆయన గీసిన ఈ చిత్రాన్ని చూసి మంత్రముగ్ధులవుతున్నారు.



నెమలి ఫించంపై గీసిన విశ్వనాథ్ చిత్రం



పోస్టర్‌ను అందజేస్తున్న సత్యవతి

బిజెపిని తరిమికొట్టాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

కాంగ్రెస్ పార్టీని ఆదరించి బిజెపిని తరిమికొట్టాలని డిసిసి అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి పిలుపునిచ్చారు. పురపాలక సంఘంలోని రెండో వార్డు పరిధిలోని కృష్ణాపురం పరిధిలోని శ్రీహరిపురం ప్రాంతాల్లో రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో హథ్ సే హథ్ జోడో అభియాన్ యాత్రను సోమవారం నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను పంపిణీ చేశారు. రాష్ట్రానికి కేంద్రంలోని బిజెపి, వైసిపిలు చేస్తున్న ద్రోహాన్ని ప్రజలకు వివరిస్తూ పర్యటించారు. చేయిచేయి కలుపుదాం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దామని నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సనపల అన్నాజీ, సనపల రాజులు, లఖినేని నారాయణరావు, బస్వా షణ్ముఖరావు, చింతాడ అప్పారావు, బొత్స రమణ, కూన సుందరరావు, పైడి శ్రీరాములు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

పిఎం ర్యాలీలో చోటు దక్కడం అభినందనీయం

శ్రీకాకుళం అర్బన్ : దేశ రాజధానిలో గణతంత్ర వేడుకల్లో భాగంగా ప్రధానమంత్రి ర్యాలీలో పాల్గొనే అవకాశం దక్కడం ప్రశంసనీయమని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. వేడుకల్లో హాజరై తిరిగి శ్రీకాకుళం చేరుకున్న ఎన్‌సిసి క్యాడెట్స్‌ను ఆయన సోమవారం అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సిసి అడ్వైయిజరీ కమిటీ సభ్యులు డాక్టర్ వి.రవికుమార్, వంశీకుమార్ ఆదినారాయణ, డాక్టర్ పి.వి.రమణ, డాక్టర్ జైపాల్‌రావు, డాక్టర్ శ్రీనివాస్‌పాత్రో పాల్గొన్నారు.

'ఉపాధి'ని వినియోగించుకోవాలి



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ మోహన్‌రావు

టెక్కలి: ఉపాధి హామీ పనులను సద్వినియోగించుకోవాలని బొప్పాయిపురం సర్పంచ్ గుజ్జు మోహన్‌రెడ్డి కోరారు. గ్రామంలో సోమవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో బలగ తవిటయ్య, కోదండరావు, రాము, సూర్యం, కార్యదర్శి వర్ధన్, సచివాలయ సిబ్బంది రామానాయుడు, రాజేష్, వైకుంఠరావు, తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని ఈదుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-2001 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పూర్వ విద్యార్థుల ఘనంగా సన్మానం చేశారు. నాటి జ్ఞాపకాలు, చిన్ననాటి తీపి గుర్తులు నెమరువేసుకున్నారు. ఆనందంగా గడిపారు. తమతో చదువుకున్న సహ విద్యార్థిని తన భర్తను కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించారు. మానవత్వం చాటారు. ఇకపై ఏటా ఆత్మీయ సమ్మేళనం జరుపుకోవాలి నిర్ణయించారు.

కనులపండువగా జాతర

పోలాకి: మండలంలోని సుసరాం కొండపై వెలసిన శ్రీ కనకదుర్గా భవాని అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ శాశ్వత ధర్మకర్త సనపల అప్పలసూరి మాట్లాడుతూ ఐదు రోజులపాటు జాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఆన్‌లైన్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక అక్షరాస్యత సిఎఫ్ఎల్ కోఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. మండలంలోని బొబ్బిలిపేట, అక్కులపేట గ్రామాల్లో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో ఆర్థిక అక్షరాస్యతపై సోమవారం కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్లు చేసి అకౌంటు వివరాలను అడిగితే సమాచారాన్ని ఇవ్వవద్దని సూచించారు. ఎటిఎంల్లో అపరిచితులకు డబ్బులు విత్ డ్రా చేసి పెట్టమని కార్డును ఇవ్వరాదని సూచించారు. ఎటిఎం కార్డుల వెనక పిన్ నంబరును రాయవద్దని సూచించారు. అలాగే ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన వార్షిక ప్రీమియం కేవలం రూ.20తో రూ.2 లక్షలు ప్రమాద బీమా లభిస్తుందని తెలిపారు. 18 ఏళ్ల వయసు గల వ్యక్తుల నుంచి 70 ఏళ్ల వ్యక్తులకు ఇది వర్తిస్తుందని తెలిపారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన వార్షిక ప్రీమియం కేవలం రూ.330కు రూ.2 లక్షలు జీవిత బీమా లభిస్తుందని తెలిపారు. 18 నుంచి 50 ఏళ్ల వ్యక్తులకు ఇది వర్తిస్తుందని పేర్కొన్నారు. అటల్ పెన్షన్ యోజన పథకంలో చేరితే అతి తక్కువ పెట్టుబడితో వృద్ధాప్యంలో అధిక ప్రయోజనాలను పొందవచ్చునన్నారు. డిజిటల్ పేమెంట్స్ వాటి వల్ల కలిగే లాభాలు, రూపే, ఎటిఎం కార్డు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబరుకు, అలాగే ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మెన్ 14448 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ పుష్పలత, కార్యదర్శి పూర్ణిమ, రామారావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

'ఆఫ్‌షోర్'ను పూర్తి చేయాలి

నార్త్ కోస్ట్ చీఫ్ ఇంజినీరుకు జనసేన వినతి

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించి ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌ను పూర్తి చేయాలని జనసేన నాయకులు డాక్టర్ వి.దుర్గారావు డిమాండ్ చేశారు. సోమవారం విశాఖపట్నంలో నార్త్ కోస్ట్ చీఫ్ ఇంజినీరు సుగుణాకరరావును కలిసి, వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆఫ్‌షోర్‌కు శంకుస్థాపన చేశారని, ఆయన తనయుడు జగన్ నిర్మాణ పనులకు నిధులు కేటాయించకపోవడం దారుణమని అన్నారు. రూ.700 కోట్లతో నిర్మిస్తున్న ఉద్దానం తాగునీటి ప్రాజెక్టుకు ఆఫ్‌షోర్ నీరు ఇవ్వాలని ప్రతిపాదించారని, ఆ తరువాత వంశధార జలాశయం నీటిని ఇచ్చేందుకు డిజైన్ మార్చారని అన్నారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ జలయజ్ఞంలో చేర్చి, తొలి విడతగా రూ.20 కోట్లు కేటాయించారని, ఈ ప్రాజెక్టు కాలయాపన కావడంతో నిర్మాణ వ్యయం భారీగా పెరిగిందని అన్నారు. వైసిపి ప్రభుత్వం చిల్లి గవ్వ కూడా ప్రాజెక్టుకు కేటాయించలేదని అన్నారు. ఈ ప్రాజెక్టుతో నష్టపోయిన నిర్వాసితులకు స్థలం కేటాయించి, పరిహారం కూడా కొంత ఇచ్చారని, కానీ ప్రాజెక్టు పనులు ఎక్కడి వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉందని అన్నారు. ఆఫ్‌షోర్‌ను పూర్తిచేస్తామని మంత్రి అప్పలరాజు హనుమంతు అప్పయ్యదొర జయంతి, వర్ధంతి సందర్భంగా చెబుతున్నా, ఆచరణకు నోచుకోలేదని ఆరోపించారు. త్వరలోనే రీ టెండర్లు పిలుస్తామని నార్త్ కోస్ట్ చీఫ్ ఇంజినీరు చెప్పినట్లు దుర్గారావు అన్నారు. ఇకనైనా ఆఫ్‌షోర్‌ను పూర్తి చేయాలని, లేకుంటే జనసేన పార్టీ తరపున పోరాడుతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



సుగుణాకరరావుతో మాట్లాడుతున్న దుర్గారావు

రైతులను ఆదుకోవాలి

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రైతులను ఆదుకోవాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష డిమాండ్ చేశారు. టిడిపి ఆధ్వర్యాన పలాస ఆర్‌డిఒ సీతారామ్మూర్తిని శిరీష సోమవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముందస్తు ఇకెవైసి విధానంతో రైతులు ఏడాది పొడుగున పండించిన వరి పంట అమ్మకానికి తీవ్ర ఇబ్బందులు ఎదురై, నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబపోషణ నిమిత్తం ఇతర ప్రదేశాలకు, ఉపాధి కోసం తాత్కాలిక వలస పోవడం వల్ల ఇకెవైసి చేసేందుకు అందుబాటులోలేక ఇకెవైసి అందుబాటులోలేరని, వారంతా ధాన్యం విక్రయానికి అవస్థలు పడుతున్నారని చెప్పారు. ఆర్‌బికెల్లో అమ్మకానికి కావాల్సిన ట్రక్కు సీట్లు దొరక్క రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారని వాపోయారు. దూర ప్రాంతాల్లో మిల్లర్లకు ధాన్యం అమ్మకానికి అనుమతి ఇస్తున్నారని, వారు సకాలంలో తీసుకోకపోవడంతో రవాణా ఖర్చులు, నిరీక్షణతో వ్యయభారం తప్పడం లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, టిడిపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, నాగరాజు, నవీన్, శశిభూషణ్, ఎ.కృష్ణమూర్తి, పాపారావు, గుప్తా, సూరాడ మోహన్‌రావు, అప్పారావు, నాగార్జున, కూర్మారావు, వి.యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒకు వినతిపత్రం అందిస్తున్న గౌతు శిరీష

సమాజ మార్పుకు విద్యార్థులు దోహదపడాలి

పలాస: సమాజ మార్పుకు విద్యార్థులు దోహదపడాలని అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే పిడిఎస్‌యు జిల్లా రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సమాజ మార్పుకు, దోపిడి, పీడన లేని సమాజం కోసం ఉద్యమించాలని అన్నారు. విద్యార్థులు భగత్‌సింగ్, అల్లూరి, చేగువేరా, జార్జి రెడ్డిలను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు వినోద్ మాట్లాడుతూ కేంద్రం బడ్జెట్‌లో విద్యా రంగానికి మొండి చేయి మిగిలిందన్నారు. కొఠారి కమిషన్ చెప్పినట్లు కేంద్ర బడ్జెట్‌లో 10శాతం, జిడిపిలో 6శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవి, విజయ్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాధవరావు

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న సందీప్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మేలైన యాజమాన్య పద్ధతులు, సమగ్ర సస్యరక్షణ చేపట్టడం వల్ల జీడిమామిడిలో అధిక దిగుబడులను పొందవచ్చని వ్యవసాయ అధికారి కర్ని సందీప్ అన్నారు. పెద్ద మురహరిపురంలో నిర్వహించిన తోటబడిలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో ఎరువులు వాడకం, కొమ్మ కత్తిరింపులు వంటి యాజమాన్య పద్ధతులను అవలంబించకపోవడం వల్ల టీ దోమ, తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టకపోవడం వంటి కారణాల వల్ల దిగుబడి అనేది హెచ్చుతగ్గులు వస్తుందన్నారు. సరైన యాజమాన్య పద్ధతిలను రైతులకు ముందుగా తెలియజేయడం వల్ల సకాలంలో రైతులు ఆశించిన నాణ్యమైన దిగుబడి, మంచి రాబడులను పొందడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు గొరకల విశ్వనాథం, సైని ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

సాయిరాజ్ పరామర్శ

కవిటి: మండలంలోని దూగానపుట్టుగ సర్పంచ్ దూగాన భద్రాచలంను వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, కవిటి వైస్ ఎంపిపి పూడి నేతాజీ పరామర్శించారు. భద్రాచలం తల్లి సరోజనమ్మ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సాయిరాజ్ సోమవారం ఆయన నివాసానికి చేరుకుని సరోజనమ్మ చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. ఆమె మృతికి గల కారణాలను తెలుసుకుని ఓదార్చారు. ఆయనతో పాటు ఎంపిటిసి పిరియా కష్ణారావు, డి మోహనరావు, డి శ్యామ్ తదితరులు ఉన్నారు.

'సిరిపురం' మిత్ర బృందం పర్యటన

మెళియాపుట్టి: మండలంలోని కరజాడ, టకోయి, గాథలవలస, కె.మర్రిపాడు గ్రామాల్లో సిరిపురం తేజేశ్వరరావు మిత్ర బృందం సోమవారం పర్యటించింది. 2024 ఎన్నికల్లో తేజేశ్వరరావు ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని, ఆయనకు ఆదరించాలని వారు కోరారు. అనంతరం స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. క్యాలండర్లను పంచిపెట్టారు. కార్యక్రమంలో సరాలి సర్పంచ్ పడాల షణ్ముఖరావు, మిత్ర బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ఇచ్ఛాపురం: ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని, కాలనీల్లో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని ఎంపిడిఒ రామారావు అన్నారు. సోమవారం జగనన్న కాలనీ లబ్ధిదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉగాది నాటికి గృహ ప్రవేశానికి సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎఇ దిలీప్, ఎంపిటిసి వివేకానందరెడ్డి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇకెవైసిపై ఆందోళన వద్దు

రణస్థలం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇకెవైసిపై విశ్రాంత ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎస్‌టిఒ ఎం.లిల్లీ షారోన్ అన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పున్నాన నరసింహులు నాయుడు, ఎడ్ల పాపినాయుడు తదితరులు ఎస్‌టిఒను సోమవారం కలిసిన సందర్భంగా మాట్లాడారు. ప్రస్తుతం జీవన ప్రమాణం కోసం తంబు ఇంప్రెషన్ విశ్రాంత ఉద్యోగులందరూ విధిగా వేసుకుంటే పెన్షన్ నిలుపుదల కాదని అన్నారు. ఈ తంబు ఇంప్రెషన్ మీకు అందుబాటులో ఉన్న మీ సేవ కేంద్రాల్లోనూ వేసుకోవచ్చునని చెప్పారు. ఈ నెలాఖరులోపు విశ్రాంత ఉద్యోగులందరూ వేలిముద్ర వేసుకోవాలని స్పష్టం చేశారు. మండలంలోని 417 మంది విశ్రాంతి ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. అందులో సర్వీస్ కింద 200 మంది, ఫ్యామిలీ కింద 50, ప్రొవిజన్ కింద ఒకరు ఉన్నారని వివరించారు. ఇప్పటి వరకు 300 మందికి పైగా వేలిముద్ర వేశారని తెలిపారు. మిగిలిన వారు ఈనెల 25 లోపు వేలిముద్ర వేసుకోకపోతే పెన్షన్ నిలుపుదల అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. వీరితో పాటు విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఎం.వి.రమణ, వెంకటస్వామి, మీసాల రామారావు, మాడుగుల రామారావు, మేడూరి సత్యనారాయణ ఉన్నారు.



పతకాలతో క్రీడాకారులు

కరాటేలో క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి- పలాస

ఉత్తరాఖండ్‌లో ఇటీవల జరిగిన కరాటే పోటీలో బొడ్డపాడు క్రీడాకారులు నితిన్, వెంకటేష్ ప్రతిభను చాటారు. ఉత్తరాఖండ్‌లో జాతీయ స్థాయిలో జరిగిన కరాటే పోటీలో నితిన్ వెండి, కాంస్యం పతకాలు, వెంకటేష్ జూనియర్ విభాగంలో బంగారం పతకం సాధించాడు. అండమాన్‌లో నివాసం ఉంటున్న మద్దిల తాతారావు ఇద్దరు కుమారులు కరాటే పోటిలో పతకాలు సాధించడం విశేషం. గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చి పెట్టిన నితిన్, వెంకటేష్‌ను అఖిల భారతీయ యాదవ మహాసభ పలాస మండలం అధ్యక్షులు కిక్కర ఢిల్లీరావు, గ్రామస్తులు, క్రీడా అభిమానులు అభినందనలు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ జమ చేయరూ..

నందిగాం: జిల్లా గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగుల పెన్షన్లు జనవరి నెలది జమ చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి టి.వైకుంఠరావు, జి.విశ్వేశ్వరరావు కోరారు. సోమవారం వారు ఓ ప్రకటనను విడుదల చేశారు. పెన్షనర్లు ఆరోగ్య ఖర్చులు, ఇంటి అద్దెలు, నిత్యావసరాలకు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే పెన్షన్ బకాయి చెల్లించాలని కోరారు.